


రోబోటిక్ చికిత్స గురించి వివరిస్తున్న సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ శశికాంత్, డాక్టర్ ప్రవీణ్ మేరెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ వేద ప్రకాశ్

## కీళ్ల మార్పిడికి రోబోటిక్ సర్జరీ

### నానక్‌రామ్‌గూడ స్టార్ హాస్పిటల్స్‌లో ప్రారంభం

శేరిలింగంపల్లి, మే 21: మోకాలు కీళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులకు తక్కువ నొప్పితో వేగవంతమైన చికిత్సను అందించడమే లక్ష్యంగా నానక్‌రామ్‌గూడ స్టార్ హాస్పిటల్స్ బుధవారం అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను ఆవిష్కరించింది. ఈ కొత్త తరం రోబోటిక్ వ్యవస్థ సాయంతో అసాధారణమైన కచ్చితత్వం, తక్కువ మోతాదు గాయంతోనే శస్త్రచికిత్స చేయవచ్చని హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్, డాక్టర్ ప్రవీణ్ మేరెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ వేద ప్రకాశ్ వివరించారు. శస్త్రచికిత్స జరిగిన 24 గంటల వ్యవధిలోనే రోగి నడవగలడని, ఫలితం దీర్ఘకాలం ఉంటుందని చెప్పారు. రోగులు మళ్లీ చురుకుగా తమ కార్యకలాపాలు సాగించవచ్చన్నారు. రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ గేమ్ చేంజర్‌గా కీలకపాత్ర పోషించనుందని చెప్పారు. ఈ ఆపరేషన్‌కు సీటీ స్కాన్ అవసరం లేదని, ఫలితంగా రోగులకు ఖర్చు తగ్గుతుందని, అనవసరమైన రేడియేషన్ ఎక్స్‌పోజర్ ఉండదని వివరించారు.

## ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

మాక్లూర్, మే 21: ఇంటిని ఆన్‌లైన్ చేయడానికి లంచం అడిగిన గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గొట్టుముక్కలకు చెందిన ముప్పడి రాజేందర్ గ్రామంలోని తన ఇంటిని ఆన్‌లైన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి కట్కం మోహన్‌ను ఆశ్రయించగా ఆయన రూ.25వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు అంతగా ఇవ్వలేనని తెలుపడంతో రూ.18వేలకు ఒప్పందం కుదిరింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శికి రూ.18వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మోహన్‌పై కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన సూర్యాపేట ఆర్‌డబ్ల్యూస్ ఏఈ

చిలుకూరు, మే 21 : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతాతండాకు చెందిన ఇస్లావత్ వినోద్ మహబూబ్‌నగర్ జిల్లా మార్తాల్‌లో ఆర్‌డబ్ల్యూస్ ఏఈగా పనిచేశాడు. ఏడు నెలల క్రితం సూర్యాపేట ఆర్‌డబ్ల్యూస్ ఏఈగా వచ్చాడు. గతంలో పనిచేసిన చోట మిషన్ భగీరథ పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను తీసుకొనివచ్చి తన వద్దే ఉంచుకున్నాడు. ఎంబీ రికార్డులు కావాలంటే కోదాడకు వచ్చి రూ.లక్ష ఇవ్వాలని కాంట్రాక్టర్లను డిమాండ్ చేయగా వారు ఏసీబీని ఆశ్రయించారు. ఏఈ వినోద్ తన అన్న కొడుకు మూర్తితో కలిసి కోదాడకు రాగా కాంట్రాక్టర్లు వారికి డబ్బులు ఇచ్చారు. తనను ఎవరో వెంబడిస్తున్నారని గమనించిన వినోద్ వెంటనే మూర్తికి డబ్బులు ఇచ్చి కారులో పరారయ్యాడు. ఏసీబీ అధికారులు వినోద్ స్వగ్రామం సీతాతండాలోని ఆయన ఇంట్లో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

## ‘ప్రకటిత నేరస్థుడి’గా ప్రభాకర్‌రావు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 21 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ‘ప్రకటిత నేరస్థుడు’ (ప్రొక్లెయిమ్డ్ అఫెండర్)గా నాంపల్లి కోర్టు ప్రకటించింది. 14వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభాకర్‌రావు నెలరోజుల్లోగా కోర్టుకు హాజరుకావాలని, లేనిపక్షంలో ఆయన ఆస్తులను జప్తు చేసుకునేందుకు అధికారులు అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. ఈ ఉత్తర్వుల కాపీని ప్రభాకర్‌రావు ఇంటికి అతికించడంతోపాటు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయాలని తెలిపారు. దీంతో ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావు భారత్‌కు తిరిగి రాక తప్పదని అధికారులు చెప్తున్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

## అనాథ యువతి పెండ్లి పెద్దగా కలెక్టర్

పెద్దపల్లి, మే 21(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో అనాథ యువతి మానస వివాహం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. రామగుండం తబిత బాలల సంరక్షణ కేంద్రంలో ఉంటున్న మానస – రాజేశ్ వివాహాన్ని బుధవారం ఉదయం 11:05 గంటలకు వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు భాష్యం రంగాచార్యులు, పవన్ కుమార్, హరీశ్‌కుమార్ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పెళ్లి పెద్దగా కలెక్టర్ వ్యవహరించగా, తబిత బాలల సంక్షరణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న దంపతులు కన్యాదానం చేశారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత శాఖ అధికారులు పెండ్లి ఏర్పాట్లు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, అదనపు కలెక్టర్ వేణు, డీసీపీ కరుణాకర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శంకర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. టీఎన్జీవో సంఘం సేకరించిన రూ.61,800 చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యే వధూవరులకు అందజేశారు.

## 23 మందికి సీడీపీవో ఉద్యోగాలు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : మహిళా శిశు సంక్షేమశాఖలోని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సీడీపీవో) ఉద్యోగాల భర్తీ పూర్తయ్యింది. మొత్తం 23 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపికచేశారు. ఎంపికైన వారి ప్రొవిజినల్ జాబితాను https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కమిషన్ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2022 సెప్టెంబర్‌లో సీడీపీవో నోటిఫికేషన్ విడుదల కాగా 19,812 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2025 జనవరి 3,4 తేదీల్లో సీబీటీ పద్ధతిలో రాత పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు విడుదల చేసిన కమిషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసి మల్టీజోన్–1, మల్టీజోన్–2 వారీగా జాబితా విడుదల చేసింది.

## 27 నుంచి ఎంఈవోలకు శిక్షణ

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యాశాఖ, మండల విద్యాధికారులకు(ఎంఈవో) శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు. ఎంఈవోలతోపాటు సమగ్రశిక్ష జిల్లా కో ఆర్డినేటర్లకు సైతం కన్హా శాంతివనంలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.


## సాంకేతికలోపంతో విమాన సర్వీస్ రద్దు

శంషాబాద్ రూరల్, మే 21 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్రాంక్‌పోర్టు ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో విమాన సర్వీస్‌ను రద్దు చేసినట్టు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్రాంక్‌పోర్టు ఎయిర్‌పోర్టుకు వెళ్లాల్సిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో పైలట్ విమానాన్ని రన్‌వే పై నిలిపి అధికారులకు సమాచారం ఇచ్చారు. విమానంలో 165 మంది ప్రయాణికులు ఉన్నారు.

### అత్యవసర ద్వారం తీయడానికి యత్నించిన మహిళ అరెస్టు

కర్ణాటకకు చెందిన దీప(38) బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి భువనేశ్వర్‌కు వెళ్లడానికి ఇండిగో విమానం ఎక్కింది. విమానంలోకి వెళ్లిన తర్వాత పలుమార్లు అత్యవసర ద్వారం తీయడానికి యత్నించింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది హెచ్చరించినా తీరు మారకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్టు సీఐ బాలరాజు తెలిపారు.

# రైతు బీమాకూ సర్కారు ధోకా!



మొదటిపేజీ తరువాయి...

మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం చెల్లింపులు నిలిపివేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వందలాది రైతు కుటుంబాలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాయి. వివిధ కారణాలతో రైతులు మరణిస్తుంటే.. ఆయా కుటుంబాలు అనుభవిస్తున్న ఆర్థిక కష్టాలను చూసి చలించిన నాటి సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలుచేశారు. ఈ పథకం కింద 18 నుంచి 59 ఏండ్ల వయస్సు గల రైతులకు ప్రభుత్వం తరపున ఉచిత బీమా చేయించారు. రైతు ఏ కారణంతో చనిపోయినా సరే ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించే ఏర్పాటుచేశారు. ఇందుకోసం ఎల్ఐసీతో ప్రత్యేకంగా ఒప్పందం చేసుకున్నారు. రైతులపై బీమా ప్రీమియం భారం కూడా పడొద్దనే సదుద్దేశంతో ఆ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈవిధంగా ఏటా ఆగస్టులో ఒక్కొక్క రైతుకు రూ.3,556 చొప్పున సుమారు రూ.1,400 కోట్ల వరకు ఎల్ఐసీకి ప్రీమియం చెల్లిస్తూ వచ్చింది. దీంతో దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే.. నెల రోజుల్లోపే రూ.5 లక్షల పరిహారం నామినీ ఖాతాలో జమయ్యేది. 2018 ఆగస్టు 15న ఈ పథకానికి కేసీఆర్ శ్రీకారం చుట్టగా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత కాలం ఈ పథకం నిరాఘాటంగా కొనసాగింది.

### ప్రీమియం చెల్లించని కాంగ్రెస్ సర్కారు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబీమా ప్రీమియం చెల్లింపుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నది. రెండో విడత ప్రీమియం కింద ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.700 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. కానీ, ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో ఎల్ఐసీ పరిహారం చెల్లింపును నిలిపివేసింది. రైతుల నుంచి విమర్శలు రావడం, ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టిగా ప్రశ్నించడంతో కొంత కొంత చెల్లిస్తూ వచ్చింది. ఇంకా రూ.100 కోట్ల వరకు బకాయి ఉన్నట్టు తెలిసింది. దీంతో ఈ మేరకు ఎల్ఐసీ రైతు కుటుంబాలకు పరిహారం నిలిపివేస్తున్నది. ఫిబ్రవరి నుంచి మరణించిన రైతులకు సంబంధించిన పరిహారం ఆయా కుటుంబాలకు అందడంలేదని తెలుస్తున్నది.

### రంగారెడ్డిలో 117 కుటుంబాలకు అందని పరిహారం

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 117 మంది రైతులు చనిపోయారు. ఆయా రైతు కుటుంబాల సభ్యులు బీమా పరిహారం పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్లను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. కానీ, వారికి ఇంతవరకు బీమా డబ్బులు అందలేదు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే, తమ వద్ద ఏమీ పెండింగ్‌లో లేదని, డాక్యుమెంట్లు అన్నీ ఉన్నాతాధికారులకు పంపించామని అంటున్నారని మృతుల కుటుంబసభ్యులు చెప్తున్నారు. వరంగల్ జిల్లాల్లో సుమారు 100 మంది రైతులు మరణించగా ఆయా కుటుంబాలకు పరిహారం అందలేదని తెలుస్తున్నది. ఈవిధంగా రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో రైతు కుటుంబాలు పరిహారం అందక దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాయి. గతంలో రైతు మరణించిన 15 నుంచి నెల రోజుల్లో పరిహారం పైసలు అకౌంట్లో జమయ్యేవి. కానీ, ఇప్పుడు రెండు మూడు నెలలు గడిచినా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

## ఏడీఏ సస్పెన్షన్

కంఠేశ్వర్, మే 21: నిజామాబాద్ ఏడీఏ ప్రదీప్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్పల్లి మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన ప్రవీణ్ చనిపోయి సంవత్సరం అవుతున్నా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంలో జాప్యం జరుగుతున్నది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఏవో ఫొటోతో ఈ నెల 15న కలెక్టరేట్‌లోని ఏడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నమస్తే తెలంగాణ మెయిన్ ఎడిషన్‌లో ‘చనిపోయి ఏడాది అవుతున్నా బెనిఫిట్స్ ఇవ్వరా..?’ అనే శీర్షికతో వార్త ప్రచురించింది. దీంతో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సింగారెడ్డి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శివాజీపాటిల్‌తో కమిషన్ ఏర్పాటు చేసి, విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఏడీఏ ప్రదీప్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. బాధిత కుటుంబ సభ్యులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

## 10 నెలల పాపకు రూ.14 కోట్ల ఖరీదైన ఇంజెక్షన్

### అరుదైన కండరాల వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ‘రెయిన్‌బో’ హాస్పిటల్‌లో విజయవంతంగా జన్యు చికిత్స

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) అనే అరుదైన కండరాల వ్యాధితో బాధపడుతున్న 10 నెలల పాపకు సికింద్రాబాద్‌లోని ‘రెయిన్‌బో’ హాస్పిటల్ వైద్యులు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన జన్యు చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కోనంకి రమేశ్ పర్యవేక్షణలో ఆ చిన్నారికి రూ.14 కోట్ల ఖరీదైన జోల్జెన్స్మా ఇంజెక్షన్‌ను ఇచ్చారు. ఎస్ఎంఏ వ్యాధికి కారణమైన ఎస్ఎంఎన్–1 జన్యువును సరిచేసే ఈ మందును క్రౌడ్ ఫండింగ్ ద్వారా అమెరికా నుంచి తెప్పించినట్టు ‘రెయిన్‌బో’ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. 10 వేల మంది పిల్లల్లో ఒకరిని మాత్రమే ప్రభావితం చేసే ఈ వ్యాధితో మన దేశంలో వెయ్యి మంది చిన్నారులు బాధపడుతున్నట్టు తెలిపారు.

## రాయల్ సొసైటీలో ఐఐటీ ప్రొఫెసర్లకు స్థానం

- ఇద్దరు తెలుగు వారికి దక్కిన అరుదైన గౌరవం
- అభినందించిన ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి, మే 21(నమస్తే తెలంగాణ) : మునుపెన్నడూ లేనివిధంగా ఒకే సంవత్సరంలో ఇద్దరు తెలుగు ప్రొఫెసర్లు, సైన్స్ పరిశోధకులకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మకమైన లండన్ రాయల్ సొసైటీలో తెలుగువారైన చెన్నుపాటి జగదీశ్, మల్లికార్జున్‌కు ఫెలోషిప్ లభించింది. రాయల్ సొసైటీ ఫెలోషిప్(ఎఫ్ఆర్ఎస్) దక్కించుకున్న ప్రొఫెసర్ తాటిపాముల మల్లికార్జున్ వరంగల్ వాసి కాగా, ప్రొ.చెన్నుపాటి జగదీశ్ ఆంధ్రప్రదేశ్ వల్లూరుపాలెంకు చెందినవారు. జగదీష్ పెరిగి విద్యాభ్యాసం చేసింది ఖమ్మం జిల్లాలోని ఆరెకాయలపాడు. రాయల్ సొసైటీలో ఫెలోషిప్ దక్కించుకున్న జగదీష్, మల్లికార్జున్ ఐఐటీ హైదరాబాద్‌లో విజిటింగ్ ప్రొఫెసర్లుగా సేవలు అందిస్తున్నారు. వీరిని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బుధవారం అభినందించారు.



నిర్మల్ జిల్లా బాసరలో మాట్లాడుతున్న రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సభ్యులు

## పూజారి బైండోవర్ అన్యాయం

- దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయండి
- ఏఎస్పీకి బ్రాహ్మణ సంఘం ఫిర్యాదు

బాసర, మే 21 : బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌పై దాడి ఘటనలో తహసీల్దార్ ఎదుట పూజారిని బైండోవర్ చేయడం అన్యాయమని రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని కోరుతూ నిర్మల్ జిల్లా బాసర పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఆంధ్ర స్వాములోరి వేద పాఠశాలలో ఒక విద్యార్థిపై దాడి, ఒక విద్యార్థి మృతి, గోదావరి ఘాట్ కబ్జా, గోదావరి నిత్యహారతి కార్యక్రమం, శాస్త్రానికి విరుద్ధంగా నాలుకపై బీజాక్షరాలు రాయడం లాంటి ఘటనల్లో పోలీసుల విచారణ కొనసాగుతున్నది. వేద పాఠశాల స్వామీజీ అనుచరుడు నూకం రామారావు బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి వాకింగ్‌కి వెళ్తుండగా దాడి చేసిన ఘటనలో పూజారి ఫిర్యాదుతో రామారావును అరెస్టు చేయకుండా, తిరిగి రామారావు పూజారిపై ఇచ్చిన ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు బాసరకు వచ్చి సంజీవ్ పూజారికి సంఘీభావం తెలిపారు. పూజారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేయడం అన్యాయని మండిపడ్డారు. రామారావుపై చర్యలు తీసుకోవాలని, లేదంటే దేశవ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


## రాహుల్‌ను అమరుడిని చేసిన రేవంత్!

### రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకల్లో నోరుజారిన సీఎం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి నోరుజారారు. పార్టీ లోక్‌సభాపక్ష నేత రాహుల్ అసువులు బాసినట్లు నోరుజారారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నేత వీ హనుమంతరావు తదితర నేతలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో తీవ్రవాదాన్ని అణచివేయడంలో, దేశ సమగ్రతను కాపాడటంలో, మహాత్మా గాంధీ, ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ అసువులు బాసారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని పార్టీ శ్రేణులు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఆయన రాజీవ్‌గాంధీకి బదులుగా రాహుల్ గాంధీ అని చెప్పటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల నుంచి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# కరెంట్ కట్ చేస్తే.. పరిహారం పొందొచ్చు!

- నిరంతర విద్యుత్తు సరఫరా వినియోగదారుల హక్కు
- మీటరింగ్, బిల్లుల జారీలో లోపాలకు కూడా పరిహారం
- వినియోగదారుల హక్కులను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం



హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): కరెంట్ పోయిందంటే వినియోగదారులు డిస్కం నుంచి పరిహారం పొందవచ్చు అనే విషయం చాలామందికి తెలియదు. నగరాలు, పట్టణాల్లో నాలుగు గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 8 గంటలు కరెంట్ పోతే ఒక వినియోగదారుడికి డిస్కంలు రూ.200 పరిహారం చెల్లించాలని నిబంధనలు చెప్తున్నాయి. ఒకే అపార్ట్‌మెంట్, కాలనీలో కరెంట్ పోతే ఎంత మంది బాధితులుంటే అంత మందికి ఒక్కో వినియోగదారుడికి రూ. 100 చొప్పున పరిహారం చెల్లించాలి. పట్టణాలు, నగరాల్లో 8 గంటలలోపు అయితే ఒక కనెక్షన్‌ను రూ. 200, ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉంటే కనెక్షన్‌కు రూ. 100 చొప్పున పరిహారం చెల్లించాలి. బిల్లు, పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత కూడా కనెక్షన్ కట్ చేస్తే రోజుకు రూ. 200 పరిహారంగా డిస్కంలు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్తు చట్టం 2003 సెక్షన్ 176 ప్రకారం విద్యుత్తు వినియోగదారుల హక్కులను కేంద్రం ప్రకటించింది. పంపిణీ సంస్థలు ఉద్దేశపూర్వకంగా విద్యుత్తు అంతరాయం కల్పించొద్దని తెలిపింది. ఇందుకు వినియోగదారులు పరిహారం పొందే హక్కును కలిగి ఉంటారని కేంద్రం పబ్లిక్ నోటీస్‌లో వెల్లడించింది. 24 గంటల నిరంతర విద్యుత్తు వినియోగదారుల హక్కు అని పేర్కొన్నది. కొత్త కనెక్షన్లు, కనెక్షన్ తొలగింపు, లోడ్ మార్పు, వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కేంద్రం నిర్దిష్ట గడువును విధించింది. ఈ సేవలను అందించడంతో జాప్యం జరిగితే డిస్కంలు పరిహారం చెల్లించాలని స్పష్టంచేసింది.

- ఓవర్‌హెడ్ లైన్/ కేబుల్ బ్రేక్‌డౌన్ అయితే పట్టణాలు, నగరాల్లో 6 గంటల లోపు అంతరాయానికి ఒక వినియోగదారుడికి రూ. 200, ఒకరి కంటే ఎక్కువ వినియోగదారులుంటే ఒక్కొక్కరికి రూ.100 చొప్పున పరిహారం చెల్లించాలి. గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల అంతరాయానికి ఒక వినియోగదారు అయితే రూ.200, ఒకరి కంటే ఎక్కువ వినియోగదారులంటే ఒక్కొక్కరికి రూ.100 వరకు పరిహారంగా విద్యుత్తు సంస్థలు చెల్లించాల్సి ఉంటుంది.
- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే పట్టణాల్లో 24 గంటలలోపు బిగించకపోతే రోజుకు రూ.200–400, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల లోపు బిగించకపోతే రోజుకు రూ.200–400 పరిహారం పొందవచ్చు.
- విద్యుత్తు మీటర్ సక్రమంగా పనిచేయకపోతే మీటర్‌ను మార్చాలని వినియోగదారులు డిస్కంలను కోరవచ్చు. చెడిపోయిన మీటర్‌ను పట్టణాల్లో 7 రోజులు, గ్రామాల్లో 15 రోజుల్లో సరిచేయకపోతే రోజుకు రూ.200 పరిహారం పొందవచ్చు.
- విద్యుత్తు బిల్లుల ఫిర్యాదులపై డిస్కంలు సకాలంలో స్పందించాలి. ఫిర్యాదు వచ్చిన 24 గంటల్లోపు పరిష్కరించకపోతే రోజుకు రూ.100, 7 పనిదినాల్లో అడిగిన అదనపు సమాచారాన్ని అందించకపోతే రోజుకు రూ.100 చొప్పున పరిహారాన్ని చెల్లించాలి.
- బిల్లులు చెల్లించలేదనే కారణంతో కనెక్షన్ తొలగించినట్టయితే బిల్లు చెల్లించినట్టు ప్రూఫ్ చూపించిన తర్వాత పట్టణ ప్రాంతాల్లో 4 పనిదినాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 12 పనిదినాల్లో కనెక్షన్ పునరుద్ధరించకపోతే రోజుకు రూ.200 చొప్పున పరిహారం పొందవచ్చు.

### నెట్‌వర్క్ విస్తరించకపోయినా

అవసరమైన చార్జీలు చెల్లించిన తర్వాత నెట్‌వర్క్ విస్తరించకపోయినా, అవసరమైన మేరకు విద్యుత్తు సరఫరా చేయకపోయినా డిస్కంల నుంచి వినియోగదారులు పరిహారం పొందవచ్చు. ఎల్‌టీ కనెక్షన్లకు 30 రోజుల్లోపు అయితే రోజుకు రూ. 200, 11కేవీ వినియోగదారులకు 45 రోజుల్లోపు అయితే రోజుకు రూ. 400, 33కేవీ వినియోగదారులకు 60రోజుల్లోపు అయితే రోజుకు రూ.1,000, ఎక్స్‌ట్రా హైటెన్షన్ వినియోగదారులకు 180రోజుల్లోపు అయితే రోజుకు రూ.1,000, ఈఆర్సీ విధించిన గడువులోపు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయకపోతే రోజుకు రూ. 2,000 చొప్పున పరిహారం పొందవచ్చు.

### మరికొన్నింటికి పరిహారాలు ఇలా (రోజుకు)

| సమస్య | పరిహారం మొత్తం | |
|---|---|---|
| – | ఒక వినియోగదారుకు | ఎక్కువ మంది ఉంటే ఒక్కొక్కరికి |
| అండర్‌గ్రౌండ్ కేబుల్స్ బ్రేక్‌డౌన్ పట్టణాల్లో 12గంటలు, గ్రామాల్లో 48గంటలకు | రూ. 200 | రూ.100 |
| విద్యుత్తు అంతరాయాన్ని 12గంటల లోపు సవరించకపోతే | రూ. 400 | రూ.200 |
| అంతరాయాన్ని సాయంత్రం 6 గంటల లోపు పునరుద్ధరించకపోతే | రూ. 400 | రూ.200 |
| 10 రోజుల పాటు వోల్టేజీ హెచ్చు తగ్గులుండి, సరఫరా పెంచకపోతే | రూ. 200 | రూ.100 |
| 90 రోజుల్లో డిమాండ్ మేరకు డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అప్‌గ్రేడ్ చేయకపోతే | రూ.400 | రూ.200 |
| సకాలంలో సబ్‌స్టేషన్ నిర్మించకపోతే (ఈఆర్సీ అనుమతినిచ్చిన తర్వాత) | రూ.4వేలు | రూ. 2వేలు |
| కాలిపోయిన మీటర్‌స్థానంలో 7రోజుల్లో కొత్తది అమర్చకపోతే | రూ.200 | రూ.200 |
| దరఖాస్తు చేసిన 7 రోజుల్లో మీటర్, సర్వీస్‌లైన్, షిఫ్టింగ్ చేయకపోతే | రూ. 200 | రూ. 200 |
| చార్జీలు చెల్లించిన తర్వాత కొత్త మీటర్ అమర్చకపోతే | రూ. 200 | రూ. 200 |

### ఓనర్‌షిప్ బదిలీచేయకపోయినా

విద్యుత్తు కనెక్షన్ ఓనర్‌షిప్ ఒకరి నుంచి మరొకరికి బదిలీ కోసం విజ్ఞప్తులు రావడం సర్వసాధారణం. నిర్దిష్ట గడువులోపు ఓనర్‌షిప్‌ను బదిలీ చేయకపోతే డిస్కంలు పరిహారం చెల్లించాల్సిందే. 7 రోజుల్లోపు బదిలీ చేయకపోతే రోజుకు రూ. 200, 7 రోజుల్లో క్యాటగిరి మార్పు చేయకపోతే రోజుకు రూ.200, 30 రోజుల్లో ఎల్‌టీ–1 సింగిల్ ఫేజ్ నుంచి ఎల్‌టీ–3 త్రీఫేజ్‌కు మార్చకపోతే రోజుకు రూ.200 చొప్పున పరిహారం పొందవచ్చు. 60 రోజుల్లోపు ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి, హెచ్‌టీ నుంచి ఎల్‌టీకి మార్చకపోతే రోజుకు రూ. 400 చొప్పున పరిహారాన్ని డిస్కంలు చెల్లించాలి.

### కరెంట్ పాయె..పరీక్ష వాయిదా పడె!



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించాల్సిన పరీక్ష వాయిదా పడింది. పాలమూరులోని ఫాతిమా విద్యాలయంలో బుధవారం ఉదయం సెషన్‌లో నిర్వహించాల్సిన సీయూఈటీ యూజీ–2025 పరీక్షకు బ్రేక్ పడింది. ఉదయం 8:30 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించిన అధికారులు అనంతరం గేట్లు మూసివేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ఆన్‌లైన్‌లో ప్రారంభం కాగా.. కొద్దిసేపటికే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సర్వర్ సమస్య తలెత్తడంతో విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. పరీక్ష నిర్వహిస్తారా..? లేక వాయిదా వేస్తారా.? అనే గందరగోళం ఎదురైంది. విద్యార్థులు కేంద్రం ప్రధాన గేటు వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. –మహబూబ్‌నగర్ కలెక్టరేట్

## బీజేపీ నేత కారు ఢీకొని వ్యక్తి మృతి

- న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల డిమాండ్
- ఆదుకోవాలంటూ బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఐ నేతల ధర్నా

నాగర్‌కర్నూల్, మే 21 : బీజేపీ నేత పోతుగంటి రాములు తనయుడు పోతుగంటి భరత్ ప్రసాద్ కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్‌లో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు.. తెలకపల్లి మండలం గట్టురావిపాకులకు చెందిన చటమోని రాములు(40) మంగళవారం నాగర్‌కర్నూల్ నుంచి టీవీఎస్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో అచ్చంపేట వైపు నుంచి నాగర్‌కర్నూల్‌కు వస్తున్న భరత్‌ప్రసాద్ కారు రాములును ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను జిల్లా జనరల్ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుధవారం నాగర్‌కర్నూల్ దవాఖాన ఎదుట ధర్నాకు దిగారు. బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఐ నాయకులు వీరికి మద్దతు తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఐ కనకయ్య సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.



నాగర్‌కర్నూల్ దవాఖాన ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామసులు, వివిధ పార్టీల నాయకులు